సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 15 । జనవరి । 2024

మురళీనగర్‌లో పండగ కళ



ఆశల వెలుగులు రవి కిరణాలతో పోటీపడి
పండిన కలల పంట చేతికంది..
భవిష్యత్ లక్ష్యాల పతంగులు వినువీధిలో సమున్నతంగా ఎగిరి
పౌరుషం 'పుంజు'కున్న పందేలు మన జీవనాడికి నిదర్శనంగా
ఎదఎదలో మధురోహల దర్పనంగా
తెలిమంచు పరదాలు, ముంగిళ్ల ముత్యాల ముగ్గుల్లో
రతనాల గొబ్బెమ్మలు దాటి.. బసవన్నల తంబురాలు మీటి
గడప గడపలో ఎగిసిపడ్డ సంతోష సంబరాలతో
అంబరాన విరిసి.. విశ్వంభరాన మురిసి.. సంక్రాంతి వచ్చేనంట
భోగభాగ్యాల సిరిసంపదలు మకర సంక్రాంతి తెచ్చెనంట

విశ్వంభరాన సంక్రాంతి సంబరం



సింహగిరిపై రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వరాహస్వామి సెట్టింగ్

సింహాచలం : సింహగిరిపై సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పండగ విశిష్టతను చాటుతూ, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికారులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. భోగి పర్వదినాన స్వామివారిని దర్శించుకునేందుకు సింహగిరికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామి దర్శనంతో పాటు సంక్రాంతి సంబరాలు కూడా ఒకే చోట చూసే భాగ్యం తమకు దక్కిందని ఆనందభరితులయ్యారు. విశాఖ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి సంబరాలను ప్రారంభించారు. ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున వేసిన భోగిమంటను స్వరూపానందేంద్ర సరస్వతి వెలిగించారు. భోగి పిడకలు మంటలో వేశారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, దేవస్థానం అధికారులు, సిబ్బంది ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

విశేషంగా ప్రదర్శనలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా సింహగిరి మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గొబ్బెళ్ల ముత్యాల ముగ్గులు, చెరుకు గెడలు, ఎడ్లబండి, నాగళ్లు, గడ్డిమోపులు, రంగులు వేసిన కుండలు, గోవులు, ఎద్దులబండి, కుమ్మరి చేసే మట్టి వస్తువులను భక్తులు తిలకించారు. జంగం దేవెర, కొమ్మదాసరి, హరిదాసులు సంక్రాంతి సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగిరెద్దు విన్యాసాలు, కోలాటం ప్రదర్శనలను భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



సింహగిరిపై రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన భోగిమంటలో పిడకలు వేస్తున్న భక్తులు

ధాన్యం గుట్టలవద్ద మహిళలు సందడి చేశారు. కుండల్లో పాలు పోసి పొంగించారు. స్వామివారి ఆలయాన్ని, సింహగిరి మాడ వీధులను విశేషంగా అలంకరించారు. రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వరాహస్వామి ఆర్ట్ విశేషంగా ఆకట్టుకుంది.

ఇది ప్రజల పండగ

భోగి, సంక్రాంతి, కనుమ గొప్ప పండగలని శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. సింహగిరిపై సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. యావత్ భారతావనిలోనే భోగి, సంక్రాంతి, కనుమ పండగలకు ప్రత్యేకత ఉందన్నారు. సంక్రాంతి పండగ ప్రజల పండగ అన్నారు. సింహాచలం దేవస్థానంలో ఏటా సంక్రాంతి సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీ యమన్నారు.



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

పట్నంలో పల్లె కళ



సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు,యువతులు

మురళీనగర్: పండగలు చేసుకోవడంలోనూ మురళీనగర్ వాసులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నవయువతరానికి మన సంప్రదాయాల రుచిని చూపి పల్లె అందాలను, వారి పద్ధతులను చాటే విధంగా సంక్రాంతి లక్ష్మికి పూజలు చేశారు. వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఆదివారం తెల్లవారుజాము నుంచి పది గంటల వరకు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టాయి. సుమారు వెయ్యి మంది కుటుంబాలతో సహా పాల్గొని ఐక్యత చాటుకున్నారు. ఉత్సవాలను వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ప్రారంభించారు. భోగి మంటలు వేసి అందరూ సంక్రాంతికి ఆహ్వానం పలికారు. పాటలు పాడారు. గంగిరెద్దుల ఆటలు, పీటపై బసవన్న తన నాలుగు కాళ్లతో నిలబడ్డం ఆకట్టుకుంది.హరిదాసుల కీర్తనలు పండగను ప్రాంగణానికి తీసుకు వచ్చాయి. కేకే రాజు, ఇతర పెద్దలు చిన్నారులకు బోగిపండ్లను పోసి దీవించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో కేకే రాజు, ఇతర ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ప్రజలందరి జీవితాలు భోగభాగ్యాలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. మహిళా వాకర్స్ క్లబ్ నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు కేకే రాజు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, పేడాడ రమణికుమారి, జోనల్ కమిషనర్ పి.సింహాచలం, పార్కు కార్యదర్శి పి.నాగరాజు, పృథ్వీరాజు, కృష్ణారావు మాస్టర్, మహిళావాకర్స్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న యువతులు



చిన్నారుల సందడి



కుటుంబాలతో కలిసి...



సంబరాలను సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ..



వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, పార్టీ నేత రొంగలి జగన్నాథం, వైశాఖి స్పోర్ట్సు పార్కు ప్రతినిధులు తదితరులు

నేడు పోలీస్ స్పందన రద్దు

విశాఖ సిటీ: సంక్రాంతి సందర్భంగా సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం నుంచి యథావిధిగి కొనసాగుతుందని వెల్లడించారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించాలని సూచించారు.

18న డయల్ యువర్ సీపీ

ప్రతి నెలా 1, 15 తేదీల్లో జరుగుతున్న డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని సంక్రాంతి సందర్భంగా ఈ నెల 18న నిర్వహిస్తామని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 12 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వాట్సాప్ నంబర్ 94933 36633కు ఫొటోలు, వీడియోలతో కూడిన ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

పదపదవే వయ్యారి గాలిపటమా..

బీచ్‌రోడ్డు: సంక్రాంతి సందర్భంగా బీచ్‌రోడ్డులో పతంగుల సందడి నెలకుంది. పెద్ద సంఖ్యలో నగరవాసులు బీచ్‌రోడ్డుకు చేరుకొని గాలిపటాలను ఎగురవేశారు. చిన్నారులు, యువతీ యువకులు పోటీ పడి గాలిపటాలను ఎగురువేశారు.





బీచ్‌లో గాలిపటాలు ఎగురువేస్తున్న నగరవాసులు



గాలిపటాలతో సందడి చేస్తున్న మహిళలు



37 బస్సులపై కేసుల నమోదు



ప్రైవేటు బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: సంక్రాంతి నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించిన 37 బస్సులపై కేసులు నమోదు చేశామని ఉప రవాణా కమిషనర్ రాజా రత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి ప్రైవేటు బస్సులు తనిఖీలు నిర్వహించామన్నారు. వివిధ రకాల నిబంధనలు ఉల్లంఘనలపై 37 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీలు ఈ నెల 17 వరకు కొనసాగుతాయని చెప్పారు.

అప్పన్న సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు.అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.




చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

మరో ముగ్గురికి కరోనా

మహారాణిపేట: విశాఖలో ముగ్గురికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 52 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో ముగ్గురికి కరోనా నిర్ధారణ జరిగింది. 10 మంది హోమ్ ఐసోలేషన్‌లో, ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వర రావు తెలిపారు.

45 రైళ్లు.. 100 ట్రిప్పులు

తాటిచెట్లపాలెం: పండగ సీజన్‌లో వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు సుమారు 45 ప్రత్యేక రైళ్లను 100 ట్రిప్పులుగా నడుపుతున్నట్లు చెప్పారు. ముఖ్యస్టేషన్లలో ప్రయాణికుల భద్రతా దృష్ట్యా అత్యవసర సేవల నిమిత్తం అధికారులు, సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. కమర్షియల్ సిబ్బంది, రైల్వే భద్రతా దళం, గవర్నమెంట్ రైల్వే పోలీసు, సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు, ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి ప్రయాణికులకు అసవరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు.



చికెన్ చౌక.. గుడ్డు కేక!

- కిలో బ్రాయిలర్ కోడి మాంసం రూ.190
- వంద గుడ్ల ధర రూ.599
- రిటైల్‌గా ఒక్కొక్కటి రూ.7
- నెల కిందట కేజీ చికెన్ రూ.300 పైనే
- సంక్రాంతి పండుగ వేళ తగ్గిన రేటుతో ఊరట



సాక్షి, విశాఖపట్నం: సంక్రాంతి వేళ మాంసాహార ప్రియులకు చికెన్ ధర ఊరటనిస్తోంది. సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా దీని రేటు దిగివచ్చింది. దాదాపు నెల రోజుల కిందట కిలో బ్రాయిలర్ చికెన్ రూ.300కు పైగా పలికింది. ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.190కి క్షీణించింది. సంక్రాంతి మర్నాడు కనుమ పండగకు మాంసాహారులు బంధుమిత్రులతో కలిసి విధిగా చికెన్, మటన్ వంటి వాటిని తినడం రివాజుగా వస్తోంది. సాధారణ రోజుల కంటే ఆరోజు మూడు నాలుగు రెట్లు అధికంగా వీటి వినియోగం ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకుని విక్రయదారులు వీటి ధరను గణనీయంగా పెంచుతుంటారు.



అయితే ఈ ఏడాది కనుమకు బ్రాయిలర్ కోడి మాంసం సరసమైన ధరకే లభించనుంది. కొద్దిరోజుల నుంచి మార్కెట్‌లో బ్రాయిలర్ చికెన్ కిలో రూ.170–180 మధ్య ఉంది. రెండ్రోజుల కిందట స్వల్పంగా పెరిగి రూ.190కు చేరుకుంది. అయినప్పటికీ ఈ ధర మధ్య తరగతి వారికి సైతం అందుబాటులోనే ఉంది. కిలో రూ.300 రేటుతో పోల్చుకుంటే దాదాపు 40 శాతం తగ్గింది. మంగళవారం కనుమ నాటికి మరికాస్త పెరిగినా అది రూ.10–20కి మించి ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇలా గడచిన కొన్నేళ్ల కనుమ పండగలతో పోల్చుకుంటే ఈసారి చికెన్ ధర చాలా తక్కువగా ఉందని నాన్‌వెజ్ ప్రియులు అంటున్నారు.

'ఎగ్'బాకి.. దిగివచ్చి..

మరోవైపు కోడిగుడ్ల కొద్ది రోజుల నుంచి ధర స్వల్పంగా పెరుగుతూ, తగ్గుతూ వస్తోంది. నెల రోజుల కిందట విశాఖపట్నంలో వంద గుడ్ల ధర రూ.590 ఉండగా డిసెంబర్ 27 నాటికి అది రికార్డు స్థాయిలో రూ.625కి ఎగబాకి పౌల్ట్రీ చరిత్రలో అత్యధిక ధరను నమోదు చేసింది. ఇలా ఈ నెల 10 వరకు ఇదే రేటు కొనసాగింది. 11వ తేదీ నుంచి తగ్గుముఖం పట్టి ప్రస్తుతం రూ.599 రేటు కొనసాగుతోంది. రిటైల్ మార్కెట్లో ఒక్కొక్కటి రూ.7 చొప్పున విక్రయిస్తున్నారు.

గుడ్డుపై కోల్‌కతా మార్కెట్ ప్రభావం

కోడిగుడ్ల ధరపై కోల్‌కతా మార్కెట్ ఎక్కువగా ప్రభావం చూపుతుంది. ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఒడిశా, పశ్చిమ బెంగాల్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాలకు నిత్యం కోడిగుడ్లు ఎగుమతి అవుతుంటాయి. శీతాకాలంలో ఆయా ప్రాంతాల ప్రజలు గుడ్లను విరివిగా తింటారు. దీంతో ఇతర సీజన్లకంటే ఈ శీతలంలో గుడ్ల వినియోగం గణనీయంగా ఊపందుకుంటుంది. దీనికనుగుణంగా వీటి రేటు కూడా పెరుగుతుంది. ఇటీవలే కోల్‌కతా మార్కెట్‌లో గుడ్ల కొనుగోళ్లను తగ్గించడంతో ధర క్షీణించింది. ఫలితంగా విశాఖలో వంద గుడ్ల ధర రూ.625 నుంచి 599కి తగ్గింది. ధర తగ్గితే గుడ్లను నిల్వ చేసుకునే సదుపాయం ఉత్తరాంధ్రలో అంతగా లేదు. దీంతో పౌల్ట్రీ రైతులు రేటు ఎంతున్నా తెగనమ్ముకోవల్సిన పరిస్థితి ఉంది. ఉత్తరాంధ్రలో 40 లక్షల కోళ్లు రోజుకు సగటున 32 లక్షల గుడ్లను ఉత్పత్తి చేస్తుంటాయి. దాదాపుగా ఇవన్నీ స్థానికంగానే వినియోగమవుతాయని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ జాతీయ సభ్యుడు భరణికాన రామారావు 'సాక్షి'కి చెప్పారు. పొరుగున ఉన్న ఉభయ గోదావరి జిల్లాల నుంచి వచ్చే గుడ్లను కొన్ని స్థానిక వినియోగానికి, మరికొన్ని ఎగుమతి చేస్తుంటారు.

Health





మార్కెట్లకు సంక్రాంతి శోభ

సాక్షి, విశాఖపట్నం: సంక్రాంతి శోభతో విశాఖ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. నగరంలోని ఏ మార్కెట్ చూసినా కొనుగోళ్లు, అమ్మకాలతో రద్దీగా కనిపిస్తున్నాయి. సంక్రాంతి సందర్భంగా వినియోగదారులను ఆకట్టుకోవడానికి వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ షాపులు, షాపింగ్ మాల్స్‌లను విద్యుద్దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వస్త్రాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారు ఆభరణాలు, ఇతర సరకులు కొనుగోళ్ల కోసం జనం పోటెత్తారు. వారిని ఆకట్టుకోవడానికి వ్యాపార సంస్థలు ఇప్పటికే పలు ఆఫర్లు, డిస్కౌంట్లను ప్రకటించాయి. తమ వద్ద కొనుగోలు చేసిన వారికి కార్లు, బైక్‌లు, బంగారు ఆభరణాలు, గోల్డ్ కాయిన్స్ వంటివి కూడా లక్కీ డీప్ ద్వారా గెలుపొందిన వారికి ఇస్తామని పలుచోట్ల బోర్డులు పెట్టాయి. వీటికి ఆకర్షితులై అవి ఎలాంటి ఆఫర్లో ఆరా తీయడానికి కొందరు, కొనుగోళ్లకు మరికొందరు ఎగబడ్డారు. గడచిన కొన్ని రోజులకంటే భోగి పండగ రోజైన ఆదివారం నగరంలో రద్దీతో పాటు అమ్మకాలు, కొనుగోళ్లు పలు రెట్లు అధికమైంది. దీంతో వాహనాలు, కొనుగోలుదార్లతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఎక్కడికక్కడే ట్రాఫిక్ జామ్ ఏర్పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు తీసుకున్నారు.



Gift



భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శం

- కేంద్ర న్యాయశాఖ మంత్రి మేఘువాలా
- ఘనంగా సంక్రాంతి సంబరాలు


గంగిరెద్దుల ప్రదర్శనను వీక్షిస్తున్న మంత్రి, జీవీఎల్

ఎంవీపీకాలనీ : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శమని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘవాలా అన్నారు. ఏయూ మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు భోగి పండ్ల స్నానం చేయించే సంప్రదాయం దేశం మరెక్కడా లేదన్నారు. ఈ సంప్రదాయం తెలుగు ప్రజల సంస్కృతికి నిదర్శనమన్నారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది మనదేశమేనన్నారు. తద్వారా ఆరోగ్య పరిరక్షణకు ప్రపంచానికి మార్గం చూపిందన్నారు. శ్రీరాముడు వ్యక్తిత్వం భారతీయులకు మార్గనిర్దేశం అన్నారు. ఎంపీ జీవీఎల్‌తో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. అనంతరం పలు కార్యక్రమాల్లో జీవీఎల్‌తో కలిసి కేంద్ర మంత్రి పాల్గొన్నారు. భజన గీతాలు పాడుతూ అలరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

Steel



Education



Education



అప్పన్నా.. అందుకోవయ్యా తొలిపంట

- స్వామికి తొలి పంటలు సమర్పించిన రైతులు
- భక్తులతో కిక్కిరిసిన సింహగిరి
- స్తంభించిన ట్రాఫిక్


తలపై గుమ్మడికాయలు పెట్టుకుని స్వామికి సమర్పించేందుకు క్యూలో ఉన్న మహిళలు

సింహాచలం: భోగి సందర్భంగా ఆదివారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి తొలి పంటలను కానుకగా సమర్పించారు. వరి దుబ్బులు, బియ్యం, కూరగాయలు, నూనె, పాలు, పెరుగు, వెన్న, పంచదార, పప్పు దినుసులను భక్తిశ్రద్ధలతో స్వామికి అందించారు. కరువు కాటకాలు రాకుండా ఏటా తమ పొలాలు పచ్చగా పండాలని స్వామిని వేడుకున్నారు. గ్రామీణ ప్రాంతాల భక్తులు గరిడి బృందాలతో తరలివచ్చి అప్పన్న స్వామికి మొక్కులు చెల్లించారు. ఉదయం ఐదు గంటల నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. ఎటుచూసినా సింహగిరి భక్తజన సంద్రంగా మారింది. దర్శన క్యూలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల నిండిపోయింది. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. కొండదిగువ పాత గోశాల నుంచి అడవివరం మార్గం, సింహగిరి ఘాట్‌రోడ్డుల్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.


స్వామి దర్శనానికి క్యూల్లో బారులు తీరిన భక్తులు

రుషికొండ తీరంలో స్వచ్ఛభారత్


సేకరించిన చెత్తతో స్కూబా డైవర్స్

కొమ్మాది: ప్లాటిపస్ బృందం, స్కూబా డైవర్ల ఆధ్వర్యంలో రుషికొండ బీచ్‌లో వ్యర్థాలను తొలగించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఓ మంచి కార్యక్రమం చేయాలనే తలంపుతో సముద్ర జీవులకు, వచ్చే తరానికి మంచి భవిష్యత్ అందించడం కోసం సముద్రాలను శుభ్రం చేస్తున్నట్లు ప్లాటిపస్ బృందం సభ్యులు సుభాష్ తెలిపారు. బ్లూ ఓషన్ మద్దతు ఇచ్చే బీచ్‌ల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎస్‌బీఐ సొమ్ముతో సంక్రాంతి సంబరాలా?

- ఎంపీ జీవీఎల్‌పై సీపీఎం ఆరోపణలు

డాబాగార్డెన్స్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సొమ్ముతో బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారని సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆరోపించింది. ఆయన తీరును ఖండిస్తూ సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీనిపై ఎస్‌బీఐ అధికారులు తక్షణం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధికోసం జీవీఎల్ ఎస్‌బీఐ సీఎస్సార్ నిధులను సంక్రాంతి సంబరాలు పేరిట దుర్వినియోగం చేస్తున్నారని.. ఈ ఉత్సవాలను బహిష్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

Health



Function Hall



Real Estate



కనులపండువగా గోదా కల్యాణం

- విశేషంగా ఎదురు సన్నాహోత్సవం


మాడవీధిలో స్వామి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణాన్ని తిలకిస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి


ఎదురు సన్నాహోత్సవంలో నృత్యాలు చేస్తున్న అర్చకులు


కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: భోగి సందర్భంగా సింహగిరిపై ఆదివారం సాయంత్రం గోదా రంగనాథుల కల్యాణమహోత్సవం కనులపండువగా జరిగింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి శ్రీకృష్ణాలంకారం చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్టింపజేశారు. గోదాదేవి అమ్మవారిని మరో పల్లకీలో వేంచేయజేశారు. రెండు పల్లకీలను మాడ వీధిలో తిరువీధిగా తీసుకెళ్లి ఎదురు సన్నాహోత్సవంను విశేషంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో స్వామిని, అమ్మవార్లను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు స్వామి శేషవస్త్రాలు, అక్షింతలను అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా ఎదురు సన్నాహోత్సవంలో అర్చకులు పూలదండలతో నృత్యాలు చేస్తూ అలరించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Real Estate



Real Estate



Automobile



Real Estate



ఇగ్నోలో ప్రవేశాలకు 31 వరకు గడువు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జనవరి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పించనున్నారు. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులు https://ignouadmission.samarth.edu.in/ ద్వారా ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.